

పేదల కడుపు కందిపనది!

- 4 నెలలుగా అందని కందిపప్పు
- ఆగస్టు రేషన్‌లోనూ నిరాశేనా?
- ఇంకా ఖరారు కాని టెండర్లు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 27(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పేదింటికి కందిపప్పు దూరమైంది.గత వైసీపీ ప్రభుత్వంలో కందిపప్పు సరఫరా నిలిచిపోయింది..ఆ ప్రభు త్వంలో ఇచ్చినా అరకొరగానే ఉండేది.అయితే కూటమి ప్రభుత్వంలో కందిపప్పు తప్పనిసరిగా సరఫరా చేస్తారని అంతా ఆశించారు. అయితే అదీ నిరాశగానే మారింది. ఎందు కంటే గత నాలుగు నెలలుగా రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ జరగడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6 లక్షల 54 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి నెలకు 300 మెట్రిక్ టన్నులు కందిపప్పు కేటాయించాలి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3 లక్షల 75 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి.వీరికి 200 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలి.తూర్పుగోదావరి జిల్లాలో 5 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.వీరికి 300 మెట్రిక్ టన్నులు కావాలి. మొత్తంగా మూడు జిల్లాలకు కలిపి 800 మెట్రిక్ టన్నులు కందిపప్పు పంపిణీ నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత కాలం క్రమం తప్పకుండా కందిపప్పును ప్రజా పంపిణీ వ్యవస్థలో అందజేసింది. కానీ నాలుగు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. అమరావతిలో కంది పప్పు టెండర్లు ఖరారు కాకపోవడంవల్ల సరఫరా నిలిచి పోయిందని అధికారులు అంటున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు ఎప్పుడు సరఫరా అవుతుందో చెప్పలేక పోతున్నారు. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.67కే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100 నుంచి రూ.110 వరకు ధర పలుకుతోంది. ఆగస్టులోనైనా పంపిణీ జరుగుతుం దని లబ్ధిదారులు ఆశగా చూస్తు న్నారు. వచ్చే నెలలో కూడా కందిపప్పు సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదని అధికారులు అంటున్నారు.గత వైసీపీ ప్రభు త్వంలో ఒక నెల కంది పప్పు ఇస్తే రెండు నెలలు కోత విధించేవారు.కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా పంపిణీ చేసినప్పటికీ నాలుగు నెలలుగా కంది పప్పు సరఫరాకావడంలేదు. కాకినాడ జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ దేవుల నాయక్‌ను సంప్రదించగా ఈ నెల కంది పప్పు కేటాయింపులు జరగలేదన్నారు. దీంతో ఆగస్టులో అందే పరిస్థితి కానరావడంలేదు.

నిండు గోదావరి

ధవళేశ్వరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరదతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం ఉదయం 5.46 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. అయితే సాయంత్రానికి ఉధృతి మరింత పెరగడంతో కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను 1.5 మీటర్లు పైకి ఎత్తి 6,18,044 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద 35.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై తగ్గుముఖం పట్టి ఆదివారం సాయంత్రానికి 34.60 అడుగులకు చేరుకుంది. దీంతో సోమవారం వరద మరింత పెరిగే అవకాశం ఉంది.



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి



అమ్మబడును!

అమ్మతనానికో రేటు

మీకు ఆడబిడ్డ కావాలా..? మగ బిడ్డ కావాలా..? లేదంటే ఒకేసారి అయిపోతోంది.. కవల పిల్లలు కావా లా? మగ బిడ్డకైతే ఒక రేటు.. ఆడ బిడ్డకైతే మరో రేటు.. కవల పిల్లలకైతే ఒక రేటు.. ఇలా అమ్మత నానికి రేటు కట్టేశారు.. వైద్యం పేరుతో దందాకు తెర లేపారు.. ఇష్టానుసారం దోచేస్తున్నారు. ఇది ఎంత వరకు కరెక్ట్ అనేది దంపతులు కూడా ఆలోచించుకో లేకపోతున్నారు. పిల్లలు కావాలనే ఆశతో వాళ్లు ఏం చెబితే దానికి ఊకొడుతూ లక్షలు పోస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

అమ్మతనానికో రేటు పెట్టేశారు.. ఇష్టానుసారం అమ్మేస్తున్నారు.. ఐవీఎఫ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా.. ఒక్కో జంట నుంచి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ లాగేస్తున్నా చూస్తూ ఊరుకుంటున్నారు. పిల్లలు కావాలనే ఆశతో వస్తున్న దంపతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.. అయినా అడిగే నాథుడు లేడు..పట్టించుకునే పెద్దాయన లేడు..ఎవరు ఎంత చెబితే అంత.. సికింద్రాబాద్‌లోని ఒక సంతాన సాఫల్యత కేంద్రం లో జరిగిన ఘరానా మోసం ఉమ్మడి జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. మారిన జీవనశైలి కారణంగా నగరాలు, పట్టణాల్లో 30 నుంచి 40 శాతం మంది దంపతులు సంతాన లేమితో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇటువంటి వారి సంఖ్య పెరుగుతోంది.ఇదే ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. పిల్లల కోసమని తమ వద్దకు వచ్చేవారిని వారి అండాలు, శుక్రకణాలతోనే సంతానం కలుగుతుందని చెప్పి అక్రమ మార్గాల్లో దాతలవి వినియోగిస్తూ లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు.

బలహీనతను క్యాష్ చేసుకుని..

పిల్లలు పుట్టలేదని సంతాన సాఫల్య కేంద్రాల వద్దకు వచ్చేవారి బలహీనతను క్యాష్ చేసుకుంటున్నారు. ముందుగా పలు పరీక్షల పేరుతో దందా ఆరంభమవుతుంది.పరీక్షలకే రూ.లక్ష వరకూ లాగేస్తారు. సంతానం కోసం వచ్చే వారి నుంచి రెండు నుంచి మూడేళ్ల పాటు వీలైనంత ఎక్కువ సొమ్ములు లాగడమే లక్ష్యంగా ఎక్కువ కేంద్రాలు నడుస్తున్నాయి. వచ్చిన దంపతులకు వారి వీర్యకణాలు, అండాలు వినియోగిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న కేంద్రాలు అసలు విషయాన్ని వారికి చెప్పకుండా మోసాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఇదే జరిగింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 కేంద్రాలు ఉండగా కొన్ని కేంద్రాలు ఇదే పద్ధతి అవలంబిస్తున్నాయి. ఆరోగ్యంగా ఉన్న పురుషుల నుంచి వీర్యకణాలు,మహిళల నుంచి అండాలు సేకరిస్తున్నారు. వైద్యానికి వచ్చే దంపతుల అండాలు, వీర్యకణాలు సేకరించి ఏది లోపం ఉంటే అది తీసేసి వేరే వారిది వినియోగించి ఐవీఎఫ్ పద్ధతిలో ఫలదీకరించి మహిళ గర్భాశయంలో ప్రవేశపెడుతున్నారు.విషయం తెలిసినా చాలా మంది బయటకు చెప్పుకోలేకపోతున్నారు.ఇదే సమయంలో వీర్యకణాలు, అండం సేకరించే యువతీ, యువకులకు మితిమీరి ఇంజక్షన్లు చేయడంతో వారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పర్యవేక్షణ లేక.. ఇష్టారాజ్యం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో ఉన్న సంతాన సాఫల్యకేంద్రాలు, ఐవీఎఫ్, ఐయూఐ, టెస్ట్‌ట్యూబ్ సెంటర్ల నిర్వహణపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేదనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఈ కేంద్రాలన్నీ జాతీయ, రాష్ట్రస్థాయిలో అనుమతులు, లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. దాతల వీర్యకణాలు,అండం వినియోగిస్తే అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ, రెగ్యులైజేషన్ యాక్ట్ ప్రకారం లైసెన్సు తీసుకుని వాటి మార్గదర్శకాలకు లోబడి కేంద్రాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎక్కువ కేంద్రాలు ఈ నిబంధనలు పాటించడం లేదు.అయినా ఇప్పటి వరకూచర్యలు లేవు. కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించి మో సాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ఏమిటీ ఐవీఎఫ్, ఐయూఐ

పిల్లల కోసం వచ్చే దంపతులకు ఫెర్టిలిటీ, సంతాన సాఫల్య కేంద్రాల్లో రెండు రకాల పద్ధతులను అవలంబిస్తారు. మహిళల గర్భాశయంలో ఆపరేషన్ చేయడానికి వీలులేని చిన్నచిన్న కణుతులు లేదా సమస్యలు ఉండడం, గర్భాశయ ముఖద్వారం వద్ద చర్మం మం దంగా ఉండడం, పురుషుల వీర్యకణాల్లో కదలిక తక్కువగా ఉండడం, అన్నీ సక్రమంగా ఉన్నా ఫలదీకరణ పూర్తిస్థాయిలో జరగకపోవడం వంటి సమస్యలు ఉన్న వారికి పిల్లలు పుట్టడానికి ఐయూఐ(ఇంట్రా యుటిరైన్ ఇన్‌సెమినేషన్), ఐవీఎఫ్(ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) పద్ధతులు పాటిస్తారు. ఐయూఐలో భర్త నుంచి సేకరించిన వీర్యకణాలను శుభ్రపరచి భార్య అండం విడుదలయ్యే సమయంలో నేరుగా గర్భాశయంలోకి పంపిస్తారు. ఐవీఎఫ్‌లో ల్యాబ్‌లో ఫలదీకరణ చేసి ప్రవేశపెడతారు. ఇలా చేసినందుకు లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. సింగిల్, డబుల్, ట్రిపుల్ సిట్టింగ్‌లు అంటూ ఉమ్మడి జిల్లాలో కనీసం రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి. కచ్చితంగా సంతానం అంటూ కొన్ని సెంటర్లు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకూ ఫీజులు నిర్ణయించాయి.



సంతానలేమితో బాధపడుతున్న దంపతులే టార్గెట్‌గా ఇప్పుడు టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు, ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్లు, సంతాన సాఫల్యత కేంద్రాలు ఇలా రకరకాల పేర్లతో వ్యాపార దందాకు తెరలేపాయి. వీటిల్లో అతి తక్కువ కేంద్రాలు మాత్రమే సంతానం కోసం వచ్చిన దంపతులకు అన్ని విషయాలు వివరించి, వారి అండాలు, వీర్యకణాలు సేకరించి ల్యాబ్‌లో ఫలదీకరించి మహిళల అండా(గర్భా)శయంలోకి ప్రవేశపెట్టడం ద్వారా సంతానభాగ్యం కల్పిస్తున్నారు.ఉమ్మడి జిల్లాలోని కాకినాడ,రాజమహేంద్రవరం, అమలాపురం తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఫెర్టిలిటీ సెంటర్లు ఉన్నాయి.ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది వైజాగ్ హైదరాబాదులోని కేంద్రాలకు వెళ్తున్నారు.

- ఫెర్టిలిటీ మాటున కాసుల వేట
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో 50 కేంద్రాలు
- పిల్లల కోసం రూ.లక్షల్లో వసూళ్లు
- పేరుకే ఐయూఐ, ఐవీఎఫ్
- మోసపోతున్న దంపతులు
- సికింద్రాబాద్ ఘటనతో ప్రకంపన

పెళ్లి ఆలస్యమైతే సంతానలేమి..

సొసైటీలో ఇటీవల సంతానలేమి సమస్య బాగా పెరిగింది. పెళ్లయిన జంటలకు నార్మల్‌గా పిల్లలు పుట్టే పరిస్థితి తగ్గుతోంది. ఇది ఆందోళన కల్గించే విషయం. సంతానం కోసం ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. అక్కడ లక్షలు ఖర్చుపెట్టినా పిల్లలు పుడతారనే గ్యారంటీ ఉండడంలేదు. పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం కూడా సంతానలేమికి ఒక కారణం. వివాహిత 25 ఏళ్లలోపు పిల్లలను కనడం సరైన సమయం. యువత లైఫ్ స్టైల్ మార్చుకోవాలి.

- బి.అక్కమాంబ, గైనిక్ విభాగం హెచ్‌వోడీ, రాజమహేంద్రవరం జీజీహెచ్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేటను 'తూర్పు గోదావరి'లో కలిపే బాధ్యత నాదే

- అఖిలపక్ష సమావేశంలో స్పష్టం చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలన్న డిమాండ్ నేపథ్యంలో మండపేట అర్బన్, రూరల్ మండలాలను జిల్లాలో కలిపే బాధ్యత తానే తీసుకుంటానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్పష్టం చేశారు. మండపేట పట్టణంలోని లయన్స్ కళ్యాణ మండపంలో ఆదివారం మండపేటను తూర్పు గోదావరి జిల్లాలో కలిపే అంశంపై అఖిలపక్షం తరపున వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్లతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. గత వైసీపీ హయాంలో మండపేటను రాజమహేంద్రవరంలో కలిపే అంశంపై తామంతా సమష్టిగా పోరాడినా ఫలితం లేకుండా పోయిందని కామన ప్రభాకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలపక్ష చైర్మన్‌గా ఉండాలని వక్తలు ఆయన్ను కోరగా తాను రాష్ట్రస్థాయిలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున పనిచేయలేనని బదులిచ్చారు. పలువురు నేతలు మాట్లాడుతూ మండపేటను రాజమహేంద్రవరంలో కలిపే అంశంలో ఎమ్మెల్యే వేగుళ్ల సహకారంతో సీఎం చంద్రబాబును కలిసి తమ అభ్యర్థన చెప్పుకునే అవకాశం కల్పించాలని కోరారు. తాను ఇప్పటికే ఈఅంశంపై సీఎంతో మాట్లాడానని, ఆయన సుముఖంగా ఉన్నారని వేగుళ్ల తెలిపారు. మండపేట అర్బన్, రూరల్ ప్రాంతాలను కలిపేందుకు తమకు అభ్యంతరం లేదని, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ప్రజల అభీష్టం మేరకు.. పంచాయతీల తీర్మానం ప్రకారం చర్యలు ఉంటాయని చెప్పారు. రెండు నెలల వ్యవధిలోనే దీన్ని పూర్తి చేయాలన్న సభ్యులు డిమాండ్‌పై వేగుళ్ల స్పందిస్తూ సమయం తాను చెప్పలేనని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఉంటుందని, ఇప్పటికే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోందని తెలిపారు. సమావేశంలో మండపేట మున్సిపల్ చైర్మన్ నూకదుర్గారాణి, వైసీపీ నేత పట్టాభిరామయ్య, జనసేన తరపున చంద్రరావు, బీజేపీ తరపున సత్యన్నారాయణ, రామచంద్రరావు, సామాజిక ఉద్యమకర్తలు జయరాజు, ఖాదర్‌ఖరీం, హుస్సేన్, అర్జున్ పాల్గొన్నారు.

అంతరిక్షం.. అద్భుత అవకాశం!

- అంతరిక్ష విజ్ఞానంపై రేపు అమలాపురం జడ్పీపాఠశాలలో అవగాహన శిబిరం 7

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు

- జిల్లాలో పూర్తిస్థాయిలో ఎరువుల సరఫరాకు చర్యలు
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే వరకు రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. వ్యాపారులెవరూ కృత్రిమ కొరత సృష్టించకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులను ఆయన ఆదేశించారు. అవసరాలకు మించి యూరియా వినియోగంపై తప్పనిసరిగా రైతులకు అవగాహన కల్పించి సాధ్యమైనంత మేర వాడకాన్ని తగ్గించాలన్నారు. సాగునీటి నిర్వహణ పక్కాగా జరిగితేనే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. వ్యాపారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాంప్లెక్సు ఎరువులు తీసుకుంటేనే డీఏపీ విక్రయిస్తామని, పలుప్రాంతాల్లో వ్యాపారులు నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అటువంటి వారిపై ఈసీ, పీడీ యాక్టులు నమోదు చేయాలని ఆదేశించారు. అధికంగా యూరియా వాడితే భూమి నిస్సారమవుతుందని, తద్వారా పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. శాస్త్రవేత్తలు చూపించిన మోతాదులోనే ఎరువులను వినియోగించేలా చూడాలన్నారు. అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయనానరు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతుందని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన మేర స్టాకు అందుబాటులో ఉంచాలన్నారు. నానో యూరియా వాడకంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు.

24,405 మెట్రిక్ టన్నుల ఎరువులు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1,63,399 ఎకరాల్లో వరిసాగు చేపట్టారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వెదజల్లు విధానం ద్వారా 15,744 ఎకరాలు, నాట్లు వేసే విధానంలో 73,250 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. ఈనెల 15నాటికి జిల్లాలో వరినాట్లు పూర్తవుతాయని, జిల్లాలో 24,405 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ప్రైవేటు డీలర్ల వద్ద 11,237 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌లవద్ద 3882 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల వద్ద 3461 మెట్రిక్ టన్నుల, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 2605 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోడౌన్లలో 2864 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల్లో 356 మెట్రిక్ టన్నులతో కలిపి జిల్లాలో 24,405 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 42,493 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా 34,224 మెట్రిక్ టన్నులు వచ్చాయని జిల్లా వ్యవసాయశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎరువులు అమ్మకం చేయగా 24,405 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు.

'జయలక్ష్మి సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలి'

7

రావులపాలెంలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

రాష్ట్రవ్యాప్తంగా రూ.3,525కోట్లతో రహదారి నిర్మాణ పనులు

- వచ్చే ఏడాది మార్చికి 960 కి.మీ.మేర రోడ్లు పూర్తి
- 2027, మార్చి నాటికి అందుబాటులోకి లంక గ్రామాలకు వంతెన
- ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు డైరెక్టర్, సీఈ అశోక్‌కుమార్

పి.గన్నవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఏపీఆర్ఆర్‌పీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్లప్రాజెక్టు) ద్వారా ఏఐఐబీ(ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) నిధులతో రూ.3525కోట్ల నిధులతో 2760 రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు డైరెక్టర్, సీఈ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు సంబంధిత పనులు నిమిత్తం రూ.1500కోట్లు బిల్లులు పూర్తయ్యానని తెలిపారు. గంటిపెదపూడిలో రూ.49.50కోట్లు నిధులతో నిర్మితమవుతున్న వంతెన పనులను పరిశీలించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రూ.568కోట్లు బకాయిలు ఉన్నాయని వాటికి ఇటీవలే సీఎంఎఫ్ఎస్ అప్‌లోడ్ చేశామని, వారంరోజుల్లో బకాయిలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మిగిలిన నిధులకు సంబంధించి ఆయా పనులను బట్టి బిల్లులు దశలవారీగా మంజూరవుతాయని చెప్పారు. ఏఐఐబీ నిధులతో జరుగుతున్న పనుల్లో 960 కిలోమీటర్ల మేర రోడ్ల పనులు జరుగుతున్నాయని, వాటిని వచ్చే ఏడాది 2026 మార్చి నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. వాటిలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల హైలెవిల్ బ్రిడ్జిలు కూడా ఉన్నాయని, వాటిని మాత్రం 2027, మార్చి నాటికి పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. గంటిపెదపూడిలో రూ.49.50కోట్లతో నిర్మితమవుతున్న వంతెన నిర్మాణ పనులు 60శాతం పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం సవరించిన అంచనాలను బట్టి భూసేకరణతో కలిపి అంచనా వ్యయం రూ.71కోట్లకు పెరిగిందన్నారు. వీటికి సంబంధించిన అంచనాల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. 2027, మార్చి నాటికి లంక గ్రామస్తులకు వంతెనను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఒక్క బిల్లు కూడా మంజూరు కాకుండా 60శాతం పనులు పూర్తి చేయడం పట్ల కాంట్రాక్టర్‌ను అభినందించాలన్నారు. భూసేకరణ నిమిత్తం రైతులకు రావాల్సిన సొమ్మును కూడా త్వరితగతిన అందించే విషయం ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పారు. ఇప్పటికే కలెక్టర్ కూడా రైతుల విషయమై లేఖ రూపంలో ప్రభుత్వానికి నివేదించారని ఈఈ పి.రామకృష్ణరెడ్డి వివరించారు. అనంతరం అప్రోచ్‌తో పాటు పిల్లర్లను, గడ్డర్ పనులను, కొలతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంతెన పనులు పరిశీలించిన వారిలో ఏపీఆర్ఆర్‌పీ ప్రాజెక్టు మేనేజర్, ఈఈ రమణమూర్తి, పీఆర్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి, పీఆర్ ప్రాజెక్టు ఈఈ అన్యం రాంబాబు, జేఈఈ పోతుల సత్యనారాయణ ఉన్నారు.



గంటిపెదపూడిలో హైలెవిల్ బ్రిడ్జి గెడ్డర్ పనులు పరిశీలిస్తున్న ఏపిఆర్ఆర్‌పీ ప్రాజెక్టు డైరెక్టర్, సీఈ పి.అశోక్‌కుమార్

ఇటు వరద గోదారి!



మామిడికుదురు మండలం అప్పనపల్లి వద్ద వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

అమలాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వరద గోదారి ఉరకలేస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలతో ధవళేశ్వరంవద్ద భారీస్థాయిలో వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కోనసీమ పరిధిలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమినదులకు వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆత్రేయపురం,జొన్నాడ, కోటిపల్లి, యానాం, మామిడికుదురు, దిండి, అంతర్వేది తదితర ప్రాంతాల్లో గోదావరి వరదనీటితో కళకళలాడుతోంది.

అటు ఎర్ర సముద్రం!



ఓడలరేవు సముద్ర తీరంలో వరద నీటితో ఎరుపురంగు సముద్రపు కెరటాలు

అల్లవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద నీరు పోటెత్తి సముద్రం ఎరుపురంగుగా మారింది. సముద్రతీరం వెంబడి ఇసుక ఖనిజంతో కూడిన నలుపురంగు ఇసుక మెరుస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సముద్రపునీరు ఎర్రగా, తీరంలో ఇసుక నల్లగా మారడంతో ఈ సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. గోదావరికి వరద నీరు పోటెత్తి మొగల ద్వారా లక్షలాది క్యూబిక్ మీటర్లు సముద్రంలో చేరడంతో నీలిరంగు సముద్రం ఎర్రగా మారింది.

అంతరిక్షం.. అద్భుత అవకాశం!

- అంతరిక్ష విజ్ఞానంపై రాష్ట్రంలో తొలిసారిగా పది జిల్లా కేంద్రాల్లో అవగాహన శిబిరాలు
- రేపు అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహణ

అమలాపురం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో ఏం జరుగుతుంది. అక్కడ ఏం ఉంటుంది అనే ఉత్సుకత ప్రతీ విద్యార్థిలోను ఉంటుంది. విద్యార్థి దశ నుంచే అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు భావి భారత అంతరిక్ష పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇస్రో భాగస్వామ్యంతో అమరావతి సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడ్డ జిల్లా కేంద్రాల్లో తొలిసారిగా అంతరిక్ష అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తారు. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి పర్యవేక్షణలో సమగ్ర శిక్ష, ముస్కాన్ ఎడ్యుకమ్ ఫౌండేషన్ సహకారంతో నెల రోజుల్లో శిబిరాల నిర్వహణ పూర్తి చేస్తారు.



అంతరిక్ష అవగాహన శిబిరాల్లో ఏర్పాటు చేయనున్న నమూనాలు

ఏం చెప్తారు..?

భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనల్లో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈనెల 29న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో అంతరిక్ష అవగాహన శిబిరం నిర్వహిస్తారు. ప్రధానంగా ఇస్రో ఇప్పటివరకు చేపట్టిన ప్రయోగాలు, సాధించిన విజయాలు, ఉపగ్రహాలపై నమూనాలతో విద్యార్థులకు వివరిస్తారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా తిలకించవచ్చు. అంతరిక్ష పరిశోధనల్లో జరిగిన అద్భుతాలను తెలియచేస్తారు. స్పేస్ మోడల్స్, విజువల్ డెమోస్, వీడియో ప్రజంటేషన్ ఉంటుంది. సైన్స్ సిటీ నుంచి వచ్చే రిసోర్స్ పర్సన్లు అంతరిక్ష వివరాలను విద్యార్థులకు వివరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల మంది విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞాన జ్యోతులు నింపాలన్నది లక్ష్యం కాగా ప్రతీ జిల్లా నుంచి 300 మందిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించడమే లక్ష్యంగా పేర్కొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు ఉద్యోగ అవకాశాల కోసం వివరిస్తారని జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా నేతృత్వంలో అమలాపురంలో అంతరిక్ష అవగాహన శిబిరం జరుగుతుంది. శిబిరంలో విద్యార్థులకు అవగాహన కల్పించిన అనంతరం అంతరిక్ష విజ్ఞానంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. ఆయా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. జిల్లాలో విద్యార్థులు, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిఉన్నవారు తిలకించాలని కోరారు.

'అఖండ 2' చిత్రీకరణ పూర్తి

మోతుగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతు గూడెం పర్యాటక ప్రాంతాల్లో వారంరోజుల పాటు జరిగిన అఖండ2 సినిమా చిత్రీకరణ ముగిసింది. ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద నటుడు నందమూరి బాలకృష్ణ, యాంకర్ ఝాన్సీ తదితరులపై దర్శకుడు బోయపాటి శ్రీను పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరో నందమూరి బాలకృష్ణతో పొల్లూరు శ్రీదుర్గా మల్లేశ్వరి ఆలయం ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ తదితరులు ఫొటోలు దిగారు. మోతు గూడెం యువకుడు ఆకురాతి అశోక్‌కుమార్ ఆర్మీ ఉన్నతాధికారిగా నటించాడు. అలాగే కాకినాడ, రాజమండ్రికి చెందిన యువకులు 150మందికి ఆర్మీ జవాన్ పాత్రలో నటించే అవకాశం కల్పించారు.



నటుడు బాలకృష్ణతో అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ

ఉధృతంగా గోదావరి..

కోటిపల్లి పుష్కరాల రేవులో మెట్ల వరకు వరద నీరు

కె.గంగవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి వదులుతున్న వరద నీటితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరాల రేవులో మెట్ల వరకు నీరు చేరుకుంది. కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో టికెట్ల విక్రయాల వద్ద ఉన్న సిమెంటు రోడ్డు దాకా వరద నీరు వచ్చింది. సుందరపల్లి వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రదేశంలో ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని, గోదావరి పరి వాహక ప్రాంత వీఆర్వోలు అప్రమత్తంగా ఉన్నారని తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ తెలిపారు.



కోటిపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



పుష్కరాల రేవులో వరదనీరు



గండిపోశమ్మ ఆలయ గోపురాన్ని తాకిన వరద

దేవీపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత 4 రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో ముంపు పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు నుంచి పోశమ్మగండి వరకు వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆదివారం పోశమ్మగండి వద్ద ఆలయ గోపురాన్ని తాకింది. వరద మరింత పెరిగితే ఆలయం పూర్తిగా మునిగిపోయే పరిస్థితి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురంపై దుష్ప్రచారాన్ని మానుకోవాలి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక పట్టణంగా పేరొందిన పెద్దాపురంపై దుష్ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దాపురం అన్ని రంగాల్లో ఎంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ క్రమంలో ఈ పట్టణంపై సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎప్పుడో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు ఏదో జరుగుతున్నట్టు చెప్పడం సరికాదన్నారు. సూర్యబలిజ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పెద్దాపురంపై యూట్యూబర్ తులసీచంద్ చేసిన కథనంపై రాజప్ప అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. తుమ్మల మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారంతో పట్టణ ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, పైగా దీన్ని రాజకీయ నాయకులకు ఆపాదించడం సరి కాదన్నారు. విభిన్న సంస్కృతీ, సంప్రదాయాలు కలగలిసిన పెద్దాపురం చరిత్రను దిగజార్చడం ఎంతమాత్రం సరికాదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దాపురంలో వ్యభిచారం జరుగుతోందని యూట్యూబ్ ద్వారా కథనం ప్రసారం చేసిన తులసీచంద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో కూటమి నేతలు, సూర్యబలిజ సంఘం సభ్యులు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దర్గా సెంటర్ నుంచి ర్యాలీగా తరలివచ్చి సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐ మౌనికలకు వినతి అందజేశారు. తుమ్మల మాట్లాడుతూ తులసీచంద్ పెద్దాపురం వచ్చి వాస్తవాలు చెప్పాలన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సత్యదేవుడికి రథసేవ



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. సుందరంగా వివిధ పుష్పాలతో అలంకరించిన రథంపై ఆ శీనులు గావించి పండితులు ప్రత్యేకపూజ లు నిర్వహించారు. భక్తుల గోవి ందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చిప్రధానాలయానికి తీసుకెళ్లారు.

గొల్లప్రోలులో చోరీ

25 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

గొల్లప్రోలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయితీ పరిధి ఎస్సీ కాలనీలో చోరీ జరిగింది. గుడివాడ లోవకుమారి శనివారం రాత్రి పది గంటలకు రోజూ మాదిరిగానే ఇంటి హాలులో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయింది. ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు కాలకృత్యాలు నిమిత్తం నిద్ర లేచిన సమయంలో బెడ్‌రూమ్‌లోని అల్మారా తెరిచి ఉండటానికి గుర్తించింది. గుర్తుతెలియని వ్యక్తులు అందులో ఉంచిన 25 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, నగదు చోరీ చేసినట్టు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదుతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఉరేసుకున్న పశ్చిమ బెంగాల్ వాసి



దివాకర్ కుమార్ మృతదేహం

రాజానగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరులో ఆదివారం ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దివాకర్ కుమార్ రావణి(21) స్థానిక శ్రీరాజా మెటల్ ఇండస్ట్రీస్‌లో 2 నెలలుగా కూలీ పనులు చేసుకుంటున్నాడు. శనివారం రాత్రి 10.30 గంటల వరకు తోటి కార్మికులతో కలిసి పనిచేశాడు. తెల్లవారుజామున ఇండస్ట్రీలోని ఒక షెడ్‌లో వేలాడుతూ ఉండడం గమనించిన తోటి కార్మికుడు రాజీవ్ కుమార్ సింగ్ ఇండస్ట్రీ యజమాని తాడేపల్లి విజయ్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో విజయ్ కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఉరేసుకున్నట్టు గుర్తించాడు. రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ నారాయణమ్మ కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

బండారుపేటలో యువకుడు..



చిన్న (ఫైల్)

కొత్తపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామశివారు బండారుపేటకు చెందిన పంతాడి చిన్న(21) ఆదివారం ఉదయం వాడపాలెం ఏటిగట్టు ప్రాంతంలో ఉన్న పశువుల పాకలో ఉరివేసుకుని మృతి చెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. చిన్న నాలుగేళ్ల క్రితం అర్చనను ప్రేమవివాహం చేసుకున్నాడు. శనివారం సాయంత్రం గ్రామంలో జరిగే ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి రాత్రి 11 గంటలు అయినా ఇంటికి తిరిగి రాలేదని తండ్రి తాతారావు తెలిపాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో రాత్రంతా గాలించామని, ఆదివారం ఉదయం 5 గంటలకు బండారుపేటకు ఎదురుగా ఉన్న ఏటిగట్టుపై పశువుల పాకలో చిన్న ఉరి వేసుకుని కనిపించాడని చెప్పాడు. ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి తాతారావు ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్త చేతిలో భార్య దారుణ హత్య

కొంతమూరులో ఘటన



ఉషారాణి (ఫైల్)

రాజానగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కొంతమూరులో భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైంది. స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి ఉషారాణి(28)కి పదేళ్ల కిందట నర్సీపట్నం మండలం గిడుగుటూరు గ్రామానికి చెందిన వేమగిరి మాణిక్యంతో వివాహం జరిగింది. అనంతరం ఇద్దరు కొంతమూరులోని సంతోష్‌నగర్‌లో నివాసం వచ్చారు. మాణిక్యం వెల్డింగ్ పనిచేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. భర్త తరచూ భార్యను అనుమానిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయమై గతంలో మాణిక్యంపై ఉషారాణి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. అప్పటి నుంచి మాణిక్యం కుటుంబం వదిలి వేరుగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో మృతురాలి తల్లి నలమాటి లక్ష్మి మనవడితో కుమార్తె ఇంటికి భోజనం పంపింది. సుమారు రాత్రి 11.30 గంటల సమయంలో మనవడు నిహంత్, మనవరాలు నిస్సి ఇద్దరూ కంగారుగా ఇంటి కొచ్చి అమ్మనాన్నలిద్దరూ గొడవపడ్డారని అమ్మమ్మకు చెప్పారు. అమ్మను నాన్న రాయితో అమ్మ తలపై నాప రాయితో కొట్టినట్టు వివరించారు. దీంతో ఇంటికి వెళ్లి చూడగా అల్లుడు మాణిక్యం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉషారాణి ముఖం, తలపై తీవ్రమైన రక్తపు గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఇరుగుపొరుగువారి సాయంతో ఉషారాణిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని అంగన్వాడీ టీచర్ మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో మేరిబాయి మృతదేహం



ఫైల్‌ఫొటో

కొవ్వూరు/రాజానగరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్వాడీ టీచర్ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు పట్టణంలోని 16వ వార్డు ఔరంగాబాద్‌కు చెందిన రాచర్ల మేరిబాయి (51) అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. ఆదివారం రాజానగరం సమీపంలోని పరిజర్లపేటలో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లింది. మరో సోదరుడు పోలవరం జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న తాతపూడి విజయకుమార్‌తో కలిసి మోటారుసైకిల్‌పై కొవ్వూరు బయలుదేరారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న తరుణంలో మార్గమధ్యంలో హైవేపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. మోటార్ సైకిల్‌పై కూర్చున్న మేరీబాయి పై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మరణించింది. శరీరం నుజ్జు నుజ్జు అయ్యింది. సోదరుడు విజయకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మేరిబాయికి భర్త డేవిడ్ రాజు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఇథనాల్ ట్యాంకర్

రాజానగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై కలవచర్ల కూడలిలో ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ఢీకొంది. విశాఖపట్నం వైపు నుంచి ఇథనాల్ లోడుతో రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న ట్యాంకర్ రాజానగరం వద్ద హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొంది. ట్యాంకర్ లారీ క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా ట్యాంకర్ ముందు భాగం దెబ్బతిన్నది. ప్రమాదం జరిగిన వెంటనే ముందు జాగ్రత్తగా రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది యంత్రం సహాయంతో క్యాబిన్‌ను పూర్తిగా నీటితో తడిపేశారు. ఈ సమయంలో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బంది సహాయంతో ట్రాఫిక్‌ను నియంత్రించారు. పరిసర ప్రాంతాల వారికిగానీ ఏవిధమైన ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరీ పీల్చుకున్నారు.

'జయలక్ష్మి సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయంచేయాలి'



సమావేశంలో పాల్గొన్న బాధితులు

అమలాపురం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాలకు చెందిన బాధితులు డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో జయలక్ష్మి సొసైటీ బాధితుల సమావేశం ఆదివారం నిర్వహించారు. 200మంది బాధితులు పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. అమలాపురం బ్రాంచి బాధితుడు టీవీడీఎన్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుత బోర్డులో జరుగుతున్న అవకతవకలను సభ్యులకు వివరించారు. స్టీరింగ్ కమిటీ కన్వీనర్ యారంకి రఘుభూషణ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బోర్డు సభ్యుల అసమర్థత వల్ల బాధితులకు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణం బోర్డు సభ్యులు రాజీనామా చేసి కొత్త డైరెక్టర్లకు అవకాశం ఇవ్వాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గుళ్లపల్లి వెంకట్రామ్ మాట్లాడుతూ పారదర్శకత లేని ప్రస్తుత బోర్డు వల్ల బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదన్నారు. బాధితుల్లో ఇప్పటివరకు 80మంది డిపాజిట్‌దారులు చనిపోయారని వివరించారు. మిగిలిన బాధితులకైనా సత్వర న్యాయం జరిగేలా నూతన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేని అమలాపురానికి చెందిన ఇద్దరు డైరెక్టర్లను తక్షణం రాజీనామా చేయాలని సమావేశంలో కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జోస్యుల స్వామిప్రసాద్, అల్లంరాజు గవర్రరాజుకుమార్, సభ్యులు చక్రవర్తి, బి.సుబ్బారావు, కస్తూరి రవికుమార్, పిల్లి గణేష్, బదిరీ నారాయణ తదితరులు ఉన్నారు.



భక్తులతో 'లోవ' కిటకిట

ఆలయానికి రూ.6.90 లక్షల ఆదాయం



అమ్మవారికి ప్రత్యేక పూజలు, దర్శించుకుంటున్న భక్తులు

తునిరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపుల్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరుబయట మామిడితోటలో దేవస్థానం ఏర్పాటు చేసిన గదుల్లో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఆదివారం ఆలయానికి రూ.6.90 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఇద్దరి అరెస్ట్



అరెస్ట్ అయినవారితో పోలీసులు

గండేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న పశువులను గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు సిబ్బందితో పట్టుకున్నారు. తుని నుంచి చిలకలూరిపేట తరలిస్తుండగా తమకు వచ్చిన సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. 4 ఆవుదూడలు, 12 ఎద్దు దూడలు తరలిస్తున్న అశోక్ లీలాండ్ వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పెద్దాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి వడ్లమూరు వెళ్లే రహదారిలో వారపు సంత వద్ద పొదల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసినవారు 9440904846, 9440904844 నెంబర్లకు ఫోను చేయాలని కోరారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కోనసీమ జిల్లా రావులపాలెంలో ఘటన

నిందితుల చిత్రం విడుదల చేసిన పోలీసులు



పోలీసులు విడుదల చేసిన చిత్రం

రావులపాలెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు అహరించుకుపోయిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలానికి చెందిన సత్తి రాజ్యలక్ష్మి స్థానిక కళావెంకట్రావు సెంటర్ సమీపంలో ఓ హోటల్ నిర్వహిస్తోంది. రోజులాగే మోటార్‌సైకిల్‌పై ఆమె ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆదిలక్ష్మినగర్ మూడో వీధిలో ఉన్న బంధువుల ఇంటి వద్ద బైక్ పార్క్ చేస్తుండగా ఆ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో సూత్రాలతో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. దాని బరువు 5 కాసులు ఉంటుందని, జరిగిన సంఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు. సంఘటన జరిగిన ప్రాంతం వద్ద సీసీ కెమెరా ఫుటేజీలు సేకరించారు. ఇద్దరు వ్యక్తులను గొలుసు లాక్కుని పరారైనట్టు గుర్తించి వారి చిత్రాన్ని విడుదల చేశారు. ఈ వ్యక్తులు ఎవరికైనా కనిపిస్తే వెంటనే 9440796567కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

బీచ్ రోడ్డు.. రాళ్లే చూడు..

కాకినాడలో జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి వాకలపూడి వరకు బీచ్‌రోడ్డు కోతకు గురవుతుంది. సముద్ర అలల ధాటికి రహదారి మొత్తం చెదిరిపడిన రాళ్లే కనిపిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తప్పడంలేదు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై కేసు

రావులపాలెం, జూలై27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జాతీయ రహదారిపై ఆదివారం జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రవాణా శాఖాధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని 20 ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.75వేలు అపరాధా రుసుం విధించారు.

అన్నదాతలకు సన్మానం



అమలాపురం టౌన్,జూలై 27(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నార్తుల ఆకలి తీర్చేందుకు డొక్కా సీతమ్మ అన్నదాన ఫౌండేషన్ ఏర్పాటుచేసి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా అమలాపురం భూపయ్య అగ్రహారంలోని శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో అన్నదాతల సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ వాకర్స్ సంస్థ జిల్లా పీఆర్వో యర్రమిల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అన్నదాతలు శిష్టా భాస్కరం, తటవర్తి శర్మలను సత్కరించారు. ఫౌండేషన్ నిర్వాహకుడు, యోగా గురువు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతీరోజు 200మంది పేదలకు, వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్కార భారతి ప్రాచీన కళావిభాగ ప్రముఖ్ షత్నా కృష్ణకామేశ్వర్, ఎం.సాగర్‌వర్మ, అల్లూరి తిరుపతిరావు, బుద్ధరాజు సుబ్రహ్మణ్యవర్మ, వక్కలంక సత్యనారాయణమూర్తి, ఆకొండి పవన్‌కుమార్, గోటేటి గంగాధరరావు, ముత్తుకుమార్ పాల్గొన్నారు.

గోదావరికి పెరుగుతోన్న వరద





యానాం బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం, పి.గన్నవరం: బూరుగులంకలో పడవపై ప్రయాణం

మామిడికుదురు, జూలై27(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద స్వల్పంగా పెరుగతూ ఉంది. ఆదివారం నాటికి అప్పనపల్లి స్నానాలరేవులోని మెట్లపై చేరడంతో భక్తులు వరద నీటిలోనే స్నానమాచరించారు. రెండోసారి వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం వారు పెరుగుతున్న వరద దృష్ట్యా స్నానాలరేవు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనవ్యక్తంచేస్తున్నారు. బాలబాలాజీస్వామి స్నానఘట్టం వద్ద వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. దీంతో ఆలయ సిబ్బంది హెచ్చరిక బోర్డులతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తంచేసి నదిలో స్నానంచేసే భక్తులకు జాగ్రత్తలు చెబుతున్నారు.

ముంపులో పర్యాటక ప్రాంతాలు

యానాం, జూలై27(ఆంధ్రజ్యోతి): యానాంలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురిసిన వర్షాల ప్రభావంతో గోదావరికి వరద నీరు పోటెత్తడంతో యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వదిలిన వరద నీరు యానాం గౌతమి గోదావరి నుంచి సముద్రంలోకి చేరుతోంది. దీంతో యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో వరద పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

● పి.గన్నవరం మండలం
లంక గ్రామాల్లో పడవలపై ప్రయాణం

పోటులో పెరుగుతోన్న వరద

అంతర్వేది, జూలై 27(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో గోదావరి, సముద్రం పోటు సమయంలో వరద నీరు గట్లను తాకుతుంది. సఖినేటిపల్లి రేవులో పంటు ప్రయాణం జరిగే నర్సాపురం, సఖినేటిపల్లి రేవుల్లో వరదనీరు ఉధృతంగా పైకి చొచ్చుకు వచ్చింది. వరద పోటు నీరును బట్టి రేవుప్రయాణం చేసే పంటు నిలుపుదల ప్రదేశాన్ని మార్చుకుంటున్నారు. అలాగే అప్పనరామునిలంక నుంచి సఖినేటిపల్లి, అంతర్వేది పల్లిపాలెం వరకు గోదావరి వెంబడి ఉన్న ఏటిగట్లను గోదావరి పోటు సమయంలో వరద నీరు పోటెత్తుతుంది. పాటు సమయంలో సాధారణ స్థాయిలో గోదావరి ప్రవహిస్తుంది.

సాగుతోన్న పడవ ప్రయాణం

పి.గన్నవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వరదనీటిని సము ద్రంలోకి విడిచిపెట్టారు. దీంతో జిల్లా పరిధిలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు నిండుకుంటున్నాయి. గంటిపెద పూడి శివారు బూరుగులంక నదీపాయలో తాత్కాలిక రహదారి ఇటీవల వరదకు కొట్టుకుపోయిన విషయం విదితమే. మళ్లీ వరద పెరగడంతో పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడిలంక గ్రామస్థులు ఇంజన్‌బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, అనగార్లంక తదితర గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు ప్రారంభించారు. వరద పెరగడంతో లంకల్లో వాణిజ్యపంటల రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామదేవతకు శ్రావణమాసం సారె



శ్రావణమాసం సారె తీసుకువెళ్తున్న భక్తులు

ముమ్మిడివరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): గేదెల్లంక గ్రామంలో గ్రామదేవత శ్రీలంకతల్లెమ్మ, శ్రీలక్ష్మీదుర్గమ్మ అమ్మవార్లకు గ్రామ ఆడపడుచులు పసుపు కుంకుమ, శ్రావణమాసం సారెను కానుకగా సమర్పించారు. తొలుత ఆడపడుచులు, విద్యార్థులు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి నుంచి బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేసి, అక్కడి నుంచి వినాయకుని ఆలయానికి వెళ్లి, అక్కడి నుంచి శోభాయాత్రగా అమ్మవారికి పసుపు కుంకుమల, గాజులు, పలు రకాల స్వీట్లు, చలిమిడి, పానకాలు తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. తొలుత కుంకుమార్చన నిర్వహించి అమ్మవారిని పువ్వులతో అలంకరించి సారె సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీవారు గ్రామంలో ప్రతీ ఇంటికీ అమ్మవారికి సమర్పించిన సారెను ప్రసాదంగా అందించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ కనకారావు మాట్లాడుతూ శ్రావణమాసంలో అమ్మవారిని లక్ష్మీ స్వరూపిణిగా పూజించడం వల్ల అష్ట ఐశ్వర్యాలు, పూర్ణ సౌభాగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో గుద్దటి జమ్మి, సమరసత సేవా ఫౌండేషన్ గుద్దటి వెంకటరమణమ్మ, లలితా పారాయణ బృందం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమానికి సీపీఎం శ్రీకారం



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న దృశ్యం

కాట్రేనికోన, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజల సంపదను అదానీలకు దోచిపెట్టే విధానంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిప్పికొట్టాలని సీపీఎం పిలుపు ఇచ్చింది. ఆదివారం దొంతికుర్రులో స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. స్మార్ట్ మీటర్‌కు సెల్ ఫోన్ మాదిరిగానే ముందుగానే సొమ్ము చెల్లించి రీచార్జి చేయించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి విత్తనాల రాంబాబు అన్నారు. డిమాండ్‌ను అనుసరించి పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, చలికాలం, వేసవికాలాల్లో ఇలా ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచే అవకాశం ఉంటుదన్నారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే వ్యతిరేకించిన టీడీపీ ఇప్పుడు అదే పనిని చేస్తూ ప్రజలపై భారం మోపుతోందని ఆరోపించారు. వినియోగదారులు ఏకమై స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్తిబాబు, వెంకటలక్ష్మి, కనకదుర్గ పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం



శివాలయానికి విరాళమందిస్తున్న దాతలు

మలికిపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మోరిలో శ్రీసీతారామలింగేశ్వర దేవాలయ పునఃనిర్మాణం నిమిత్తం ఆదివారం ఆర్టీసీ ఉద్యోగి పడవల వీరవెంకటసత్యనారాయణ, పద్మావతి దంపతులు వారి కుమార్తె కట్టా అమరతేజ, శ్రీవెంకటవిజయలక్ష్మిలు రూ.25,232 విరాళం అందజేశారు. ఆలయ పునఃనిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ధర్మకర్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్డాల బాబ్జి, కామిశెట్టి సూరన్న, బళ్ల సురేష్, మాలే సత్యనారాయణ పాల్గొన్నారు.

శాసనమండలి ఎస్సీ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఇజ్రాయిల్



అల్లవరంజూలై 27(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ఎస్సీ సంక్షేమ అభివృద్ధి జాయింట్ కమిటీసభ్యుడిగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను ప్రభుత్వం నియమించింది. వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇజ్రాయిల్ ఈపదవిని చేపట్టారు. ఎస్సీలకు ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు సక్రమంగా అందేలా కృషి చేస్తానని, అవసరమైతే పోరాటం చేస్తానని ఇజ్రాయిల్ అన్నారు. తనకు రెండోసారి ఈ పదవి వచ్చిందన్నారు. గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను ఆయన స్వగృహం వద్ద పలువురు నేతలు కలిసి అభినందనలు తెలిపారు.

బౌద్ధ స్థూపాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



బౌద్ధ స్థూపాన్ని పరిశీలిస్తున్న సమాచారశాఖ జాయింట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్

మామిడికుదురు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆదుర్రులోని అతి ప్రాచీన బౌద్ధ స్థూపాన్ని సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నట్టు ఐఅండ్‌పీఆర్ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఆదుర్రు బౌద్ధస్థూపాన్ని సందర్శించి అక్కడ ఉన్న కట్టడాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధ స్థూపం చుట్టూ మడ అడవులు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయని, ఈప్రదేశం టూరిజం డెవలెప్మెంట్‌కు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. క్రీస్తు పూర్వం రెండో శతాబ్దంలో వైనతేయ నదీ తీరంలో అశోకుని కుమార్తె సంఘమిత్ర పర్యవేక్షణలో ఈనిర్మాణం చేసినట్టు చారిత్రక ఆధారాలు బట్టి తెలుస్తుందని పేర్కొన్నారు. సరైన రోడ్డుమార్గం లేక ఈస్థూపం అభివృద్ధికి దూరంగా ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి అభివృద్ధి పరచాలని కోరారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఏ1 సేవాసమితి అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్, పినిశెట్టి శేఖర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు నలుగురు ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న నాయుడు తదితరులు

అమలాపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో అండర్-13 జిల్లాస్థాయిలో చెస్ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరితంగా పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 70మంది క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. బాలుర విభాగంలో పణిశెట్టి సాయిఅవినాష్ ప్రథమ, సూరత్‌వెన్నీ ద్వితీయ స్థానం సాధించారు. బాలికల విభాగంలో జాన్‌బ్లెస్సీ ప్రథమ, నూకపెయ్యి హన్విక ద్వితీయ స్థానం సాధించారు. వీరు నలుగురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఆగస్టు 2 నుంచి మచిలీపట్నంలో రాష్ట్రస్థాయి అండర్-13 చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన చెస్ క్రీడాకారులకు విద్యానిధి విద్యా సంస్థల అధినేత ఆకుల బాపన్ననాయుడు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

చించినాడ బ్రిడ్జి మూసివేత..
కళాశాల బస్సుల దారి మళ్లింపు

రాజోలు, జూలై 27(ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వంతెన మూసివేసిన నేపథ్యంలో కళాశాలల బస్సుల ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు కోరారు. ఈసందర్భంగా ఆయన రాజోలులో మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీస్ సూచనలతో కలెక్టర్ ఆదేశాలతో ఈనెల25వ తేదీ నుంచి మరమ్మతుల కారణంగా దిండి-చించినాడ వంతెనను మూసివేస్తున్నందున దిండి-చించినాడ మీదుగా రాకపోకలు కొనసాగించే పాఠశాలలు, కళాశాలల బస్సుల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు కొనసాగించాలన్నారు.

ఎన్టీఆర్ అభిమాన సంఘాల జిల్లా కమిటీలు రద్దు

అమలాపురంటౌన్,జూలై27(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఎన్టీఆర్ అభిమాన సంఘాల జిల్లా కమిటీలను రద్దుచేసి నూతన కమిటీలను ఎన్నుకునేందుకు నందమూరి అభిమానుల ఆత్మీయ సమావేశం నిర్ణయించినట్టు సేవాసమితి అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ, గౌరవాధ్యక్షులు వాసంశెట్టి జగదీష్, ఆవుపాటి వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్ర ఎన్టీఆర్ అభిమాన సంఘ కన్వీనర్ భాస్కరచౌదరి సమక్షంలో ఈనిర్ణయం తీసుకున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్టీఆర్ అభిమాన సంఘ కన్వీనర్లగా భాస్కర్‌చౌదరి, గొర్రెల రమణ, ఎండీ అన్సర్ కొనసాగుతారని చెప్పారు. ఇకపై మండలస్థాయిలో ఎన్టీఆర్ అభిమాన సంఘాలను ఏర్పాటు చేయనున్నట్టు సంఘ నాయకులు చెక్కా గణపతి, పసలపూడి శ్రీనివాస్, లంకే రవి, మట్టపర్తి రాము, ఓలేటి రాంబాబు తెలిపారు.

అబ్దుల్‌కలామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పి.గన్నవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ ఆశయసాధనకు యువత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. అబ్దుల్‌కలామ్ వర్ధంతి సందర్భంగా అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన కలామ్ రాష్ట్రపతిగా ఎదిగారని కొనియాడారు. అనంతరం అబ్దుల్‌కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది రోగులకు పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమిల్లి శ్రీనివాసరావు, తిక్కా సత్తిబాబు, ట్రస్ట్ సభ్యులు గూటం శ్రీనివాసరావు, మామిళ్లపల్లి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అమలాపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వివిధ కోర్సుల్లో హైదరాబాద్‌లోని సమర్థనం దివ్యాంగుల సంస్థ ఉచిత శిక్షణ ఇస్తుందని ఏపీ దివ్యాంగుల మహాసంఘటన మాజీ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ తెలిపారు. వినికిడి లోపం, దృష్టి లోపం, అంగవైకల్యం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలల వ్యవధితో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, బీపీవో కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18- 35ఏళ్లలోపువారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత భోజన వసతి సదుపాయంతో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందిస్తారని, వివరాలకు సెల్ 6364867804ను సంప్రదించాలని సురేష్ కోరారు.

చంద్రశేఖరరావు సేవలు మరువలేనివి

ముమ్మిడివరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని సేవాభావంతో నిర్వహిస్తూ ఎంతో మంది పేదలకు ఉచిత వైద్యసేవలు అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ జంధ్యాల చంద్రశేఖరరావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో రొటేరియన్ డాక్టర్ జంధ్యాల చంద్రశేఖరరావు ప్రియశిష్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖరరావు 90వ జయంతిని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో ఎంతోమంది యువతకు వైద్య వృత్తిని నేర్పి సేవలు అందించారని అమలాపురానికి చెందిన ప్రముఖ వైద్యులు పీఎస్వీ సాంబమూర్తి పేర్కొన్నారు. ఈసందర్భంగా చంద్రశేఖరరావు సతీమణి జంధ్యాల సీతాదేవిని శిష్య బృందం పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కుటుంబ సభ్యులు డాక్టర్ జంధ్యాల సాంబశివకుమార్-లక్ష్మీమాధవి దంపతులు, కుమార్తె ఇందిరాప్రియదర్శిని, అల్లుడు వైఎస్ గురుప్రసాద్‌లతో పాటు శిష్యులు కొప్పిశెట్టి రాంబాబు, పెద్దిరెడ్డి సుబ్రహ్మణ్యం, వేములవలస చిన్నారావు, అల్లవరకు ఆనంద్‌కుమార్, గంగాధర్, కృష్ణారావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన పశువైద్య సహాయకులకు సన్మానం

అమలాపురం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏరియా పశువైద్యశాల పరిధిలో 18మంది పశువైద్య సహాయకులు సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర మండలాలకు బదిలీ అయినట్టు సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి తెలిపారు. బదిలీపై వెళ్లిన పశువైద్య సహాయకులను పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి ఘనంగా సత్కరించారు. పశువైద్య సహాయకులు, పశువైద్యులు చిత్తశుద్ధితో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన డాక్టర్ కావ్య, అశోక్, ప్రసాద్, భానుప్రకాష్, వెంకటరమణ, మోహన్, బొక్కా శివలను సత్కరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

యానాంలో రైల్వే పీసీసీఎం పర్యటన

యానాం, జూలై 27(ఆంధ్రజ్యోతి): యానాంలో సౌత్ సెంట్రల్ రైల్వేస్ ప్రిన్సిపాల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) ఎస్.రమేష్ ఆదివారం యానాంలో పర్యటించారు. యానాం వచ్చిన ఆయన పరిపాలనాధికారి మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అయనను శాలువతో మునిస్వామి సత్కరించారు. యానానికి సంబంధించిన అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం యానాంలో పర్యాటక ప్రాంతాలను ఆయన సందర్శించి తిరిగి హైదరాబాద్ వెళ్లారు. ఆయన వెంట పీసీసీ డీసీఎం అలీఖాన్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, యానాం ఫ్రెంచ్ పౌరుల ప్రతినిధి సాదనాల బాబు తదితరులు ఉన్నారు.

స్టోర్స్ సమస్యలపై ఆర్‌సీఎస్‌తో చర్చలు



సిబ్బంది సమస్యలపై ఆర్‌సీఎస్, ఆర్‌ఏతో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, జూలై 27(ఆంధ్రజ్యోతి): యానాం సహకారా శాఖ ఆధీనంలోని యానాం కోపరేటివ్ స్టోర్స్ సమస్యలపై పుదుచ్చేరికి చెందిన రిజిస్టర్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ (ఆర్‌సీఎస్)తో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చర్చించారు. ఆర్‌సీఎస్ యశ్వంతయ్య రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాం వచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆర్‌ఏ మునిస్వామి నిర్వహించిన సమావేశంలో ఆర్‌సీఎస్, మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈసందర్భంగా సిబ్బంది పెండింగ్ జీతాలు, నూతనంగా ఏర్పాటు చేయనున్న లిక్కర్ షాపులు, యానాం కోపరేటివ్ స్టోర్స్ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.

వీరేశ్వరస్వామికి మకరతోరణం బహూకరణ



అంబాజీపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం కౌశిక నదీ తీరాన వేంచేసియున్న శ్రీఉమాపార్వతీ సమేత శ్రీవీరేశ్వరస్వామి వారికి మకరతోరణాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన వేదపండితులు మండా లక్ష్మీనరసింహమూర్తి- కమూలవతి దంపతుల ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు ఇత్తడి మకరతోరణాన్ని బహూకరించారు. తొలుత ఆలయంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అలంకరించారు.

'భవిష్యత్ అంతా క్యాంటమ్ సాంకేతికతదే'

మలికిపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల శాస్త్ర సాంకేతిక రంగాలు అన్నీ క్వాంటమ్ టెక్నాలజీపైనే ఆధారపడి ఉంటాయని డాక్టర్ యర్రంశెట్టి విజయ్‌సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్‌ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈపరిణామాలపై నేటి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికే తాను అనేక పరిశోధనా పత్రాలను రూపొందించానన్నారు. ఒకే నెలలో తాను రూపకల్పనచేసిన ఐదు పరిశోధనా పత్రాలు అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయని తెలిపారు. యువత తమ సమయాన్ని పరిశోధనా పరంగా ఆలోచించాలని సోషల్ మీడియాకు చోటు ఇవ్వదని హితవు పలికారు. ఈసందర్భంగా విజయ్‌ప్రసాద్‌ను కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.ఆనంద్‌మహనీ, పీఎస్ఎస్ రాజు, చిట్టాల సత్యనారాయణ, పీడీకే ప్రసాద్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వేంకటేశ్వరాలయం

అయినవిల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం నల్లచెరువులోని అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శాస్త్రోక్తంగా అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రక్తదాన శిబిరం

అమలాపురం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుద్దాల బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈశిబిరాన్ని నిర్వహించగా 60మంది విద్యార్థులు రక్తదానం చేసినట్టు ప్రిన్సిపాల్ చింతల సుబ్బారెడ్డి తెలిపారు. కళాశాల సిబ్బందితో పాటు బుద్దాల బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం

అమలాపురం టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం భాష్యం స్కూల్‌లో ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భాష్యం జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకట శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 400 మందికిపైగా తల్లిదండ్రులు పాల్గొన్నారు. తల్లిదండ్రులకు పిల్లలు పాద పూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, కె.నాగసశ్రీ పాల్గొన్నారు.

హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోవాలి

మామిడికుదురు, జూలై 27(ఆంధ్రజ్యోతి): హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలు ఈనెల31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వక్ఫ్‌బోర్డు సభ్యుడు ముఖర్రం హుస్సేన్ పేర్కొన్నారు. హజ్ యాత్ర దరఖాస్తులను సున్నీ, షియా జామియా మసీదుల్లోని ప్రతినిధులకు మామిడికుదురులో ఆయన ఆదివారం అందించారు. 2026 డిసెంబరు 21వరకు చెల్లుబాటు అయ్యే మిషన్ రీడబుల్స్ పాస్‌పోర్టు కలిగి ఉండాలని, దరఖాస్తులు హజ్ సువిదా యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపికైనవారు ముందస్తుగా రూ.1,25,300 డిపాజిట్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మసీదు కమిటీ అధ్యక్షుడు మసూద్ మొహిద్దీన్, కార్యదర్శి అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

సంఖ్యా శాస్త్రం గణిత శాస్త్రానికి మణిహారం

రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ

ద్రాక్షారామ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంకెలు ఆత్మానందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని సౌందర్యాన్వేషణ, హేతువాదానికి గణితమే అందమని గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. సంఖ్యా శాస్త్రంపై ఆదివారం జరిగిన సెమినార్‌కు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గణిత శాస్త్రం మేధో సంబంధమైన కళ అని, అంకెల మధ్య ఉన్న లయ, క్షేత్రగణిత ఆకారాల మధ్య గల శృతి సోయగాలు గణిత వేత్తలకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయన్నారు. అందుచేతనే గణిత పరిశోధనలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. సదస్సులో వరంగల్‌కు చెందిన కె.సంతోష్‌కుమార్, పాలకొల్లుకు చెందిన ఎం.వెంకీ, రేవతి ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి, ఎం.నాగార్జున, వై.వెంకట్రావు, అడపా సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. హాజరైన సభ్యులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.


ఆలమూరులో విలేకరులతో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

అభివృద్ధి ఓర్వలేకే ఎమ్మెల్యేపై ఆరోపణలు

వైసీపీ నాయకుల తీరుపై టీడీపీ నాయకుల మండిపాటు

ఆలమూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే బండారు సత్యానందరావును రాముడుగా భావిస్తారని, అటువంటి వ్యక్తిపై నిరాధార ఆరోపణలు చేస్తారా అంటూ వైసీపీ నాయకులపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, కార్యదర్శి సలాది నాగేశ్వరరావు అధ్వర్యంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఏడాదిలో నియోజకవర్గాన్ని రూ.150కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత బండారుదేనన్నారు. అది ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి లేనిపోని ఆరోపణలతో బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు మెర్ల గోపాలస్వామి, సాలి సత్యనారాయణ, కాలా సాయిబాబు, కేతా రాంబాబు, తాడి శ్రీనివాసరెడ్డి, వంటిపల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆలమూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు సంత మార్కెట్ సమీపంలో పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారంతో ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ అధ్వర్యంలో ఆదివారం దాడి చేశారు. పేకాటడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,310 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నరేష్ చెప్పారు.


కపిలేశ్వరపురం-కోరుమిల్లి వద్ద కుచించుకుపోయిన పంట కాలువ


కోరుమిల్లి సమీపంలో పంట కాలువను చేర్చి పెట్టిన నివాసాల సామగ్రి

పంట కాలువల ఆధునీకరణేదీ!

» సాగునీరు అందక రైతులకు అనేక ఇబ్బందులు » పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు » పిల్ల కాలువలు మరీ అధ్వానం

కపిలేశ్వరపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల పరిధిలోని ప్రధాన పంట కాలువ అభివృద్ధిని అధికారులు, ప్రజాప్రతినిధులు విస్మరించారు. దీంతో శివారు భూములకు సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా పంట కాలువలు ఆధునికరణకు నోచుకోవట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధవళేశ్వరం నుంచి కోనసీమ జిల్లా బ్రహ్మపురి దిగువ వరకు గోదావరి నది ఎడమ కాలువ ద్వారా వేలాది ఎకరాల వరి భూములకు సాగునీరు అందుతుంది. అయితే గుర్రపుడెక్క, తుప్పలు, గట్టుపై నివాసాలతో కాలువ కుచించుకుపోయింది. సమీప గ్రామాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తను కాలువల్లో పడేస్తుండడం, కాలువ గట్టుపై నివాసాలు ఉండి నీటిని కలుషితం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ కాలువపై చొప్పెల్ల, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మసకపల్లి గ్రామాల వద్ద స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన లాకులు ఆధునికీకరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. పిల్ల కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి బ్యాంక్ కెనాల్‌ను ఆధునికీకరించకపోతే కాలువ ఉనికి కోల్పోతుందని యండగండి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఆచంట శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు... సుపరిపాలనలో తొలి ఏడాదిలో భాగంగా సంధిపూడిలో పర్యటన

ఆలమూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం సంక్షేమంతో పాటు అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని సంధిపూడిలో పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తొలి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతోందని, తొలి ఏడాది పాలన పట్ల రాష్ట్ర ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరో ఒకరికి సాంకేతికలోపంతో తాత్కాలికంగా పథకం ఆగితే వాటిని పట్టుకుని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ప్రజలు పూర్తి అవగాహనతో ఉన్నారని చెప్పారు. పర్యటనలో టీడీపీ నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, దొడ్డా సుబ్బారావు, సూరపురెడ్డి పట్టాభిరామయ్య, తోట భవానీవెంకటేశ్వర్లు, వంటిపల్లి పాపారావు, సూరపురెడ్డి సతీష్, పామర్తి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సంధిపూడిలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ఏరుపల్లి సర్పంచ్ శ్రీధర్ ఆకస్మిక మృతి

ద్రాక్షారామ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏరుపల్లి సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్ (71) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. రెండు సార్లు సర్పంచ్‌గా చేసిన ఆయన ప్రస్తుతం మూడోసారి ఆ పదవిలో కొనసాగుతున్నారు. శ్రీధర్ మృతికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైసీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు పోలినాటి ప్రసాద్, వాసంశెట్టి శ్యామ్ సంతాపం తెలిపారు.


శ్రీధర్ (పాత చిత్రం)


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీమోహన్

పాత నేరస్తులు, రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

ఆలమూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కేసుల్లో నేరస్తులుగా ఉన్నవారు, రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆలమూరు పోలీస్ స్టేషన్ వద్ద పాత నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మీపై పూర్తి నిఘా ఉందని, నేరాలు, బెదిరింపులకు పాల్పడినట్టు తెలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని వివరించారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి ప్రత్యేక నిఘా ఉందని, ఈ విషయాన్ని గుర్తించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్లెక్సీ చింపివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి'

రాయవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరులో శనివారం జరిగిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటనలో గ్రామానికి చెందిన జనసేన నేతలు ఏర్పాటుచేసిన స్వాగత ఫ్లెక్సీని చింపివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామాభివృద్ధిని, కూటమి ఐక్యతను ఓర్వలేకే ఫ్లెక్సీని చించివేశారన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడడం తగదని, నిందితులను శిక్షించాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

సైఫన్ల నిర్మాణం సరే... ముంపునీరు వెళ్లే దారేదీ!

● డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిస్తేనే ముంపునీరు ముందుకు ● ఆధునికీకరణకు నోచుకోని బ్యాంక్ కెనాల్ కాలువ ● తప్పని శివారు ప్రాంత రైతులకు సాగునీటి ఇక్కట్లు


ముక్తేశ్వరం బ్యాంక్ కాలువ గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో ఐక్కుచిక్కిన కాలువ



లొల్ల వద్ద రూ.2.30కోట్లతో నిర్మించిన వెల్‌సైఫాన్

ఆత్రేయపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వేసవిలో పంట కాలువల్లో పూడిక పనులు, గుర్రపుడెక్క తొలగించకపోవడంతో సెంట్రల్ డెల్టా పరిధిలోని ముక్తేశ్వరం- బ్యాంకు కెనాల్ కాలువ ద్వారా శివారు ప్రాంత రైతులకు సాగునీరు ముందుకు వెళ్లడంలేదు. వరిసాగు చేపడుతున్న రైతులకు ఈఏడాది సాగునీరు ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా లొల్ల లాకులకు కూతవేటు దూరంలోనే వందల ఎకరాలు వరి పొలాలు కాలువ ద్వారా సాగునీరు నీటిమట్టం పెంచే సమయంలో ముంపు బారిన పడుతున్నాయి. దశాబ్దాల కాలం నుంచి ముంపుబారిన పడిన పంట పొలాలను కాపాడాలంటూ రైతుల ఆందోళనలు ఎవ్వరికి పట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇచ్చిన హామీ మేరకు సైఫాన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. రూ.2.70కోట్లతో సైఫాన్ల నిర్మాణం శరవేగంగా పూర్తిచేశారు. ముంపు సమస్య తీరింది అనుకున్న రైతుల ఆనందం కాస్త ఆవిరైంది. ముఖ్యంగా పలివెల మేజర్ డ్రైనేజీ, దేవరబంద డ్రైనేజీలను ఆధునీకరించకపోవడంతో ఇవికాస్త పూడికపోయాయి. చుక్కనీరు ముందుకు వెళ్లే పరిస్థితి కానరావడంలేదు. సైఫన్ నిర్మించినా పంటపొలాలు నుంచి ముంపు వెళ్లే మార్గం లేదంటూ రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. వాడపల్లి వద్ద నిర్మించిన సైఫన్ పూర్తి అయ్యినప్పటికి ముంపు నీరు వెళ్లే మైనర్ డ్రైనేజీ ద్వారా పంటపొలాలకు సాగునీరును మళ్లించుకుంటున్నారు. తద్వారా సైఫన్ ద్వారా వెళ్లే ముంపునీరు ముందుకు వెళ్లే పరిస్థితి కనబడటంలేదు. సాగునీటి ఇబ్బందులు లేకుండా మరో మార్గం ద్వారా పలివెల డ్రైనేజీలోకి సైఫన్ ద్వారా ముంపునీరు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేస్తేనే తమ పంట పొలాలు ముంపు బారిన పడకుండా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు. అలాగే ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ పదేళ్ల నుంచి పూడికపోయింది. శివారు రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి. లొల్లలాకుల వద్ద 10అడుగుల నీటిమట్టం పెంచితే శివారు రైతులకు అరకొర సాగునీరు అందుతుంది. ఈనేపథ్యంలో లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం పంటపొలాలు నీటమునిగి పంటకు నష్టం ఏర్పడుతుంది. సైఫన్ నిర్మాణం ద్వారా ముంపునీరు పరిష్కారం అయిందనుకున్న రైతులు కష్టాలు అలానే ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి ముంపునీరు ముందుకు వెళ్లే మార్గం చేస్తే సైఫాన్ల నిర్మాణం ఉపయోగపడుతుంది. బ్యాంక్ కెనాల కాలువలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పూడిక తొలగించడం ద్వారా శివారు ప్రాంత రైతులకు సాగునీరు మార్గం ఏర్పడుతుంది. ఆ దిశగా పాలకులు దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలి.

చోరీపై కేసు నమోదు

ఆత్రేయపురం, జూలై 27ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లోకి గుర్తుతెలియని చొరబడి వెండి, బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. ఈసంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. తాడిపూడి గ్రామానికి చెందిన పెన్మత్స వెంకటకృష్ణంరాజు ఇటీవల కుటుంబసభ్యులతో హైదరాబాద్ వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపు తెరిచి ఉంది. బీరువాలో ఉంచిన 3కిలోల వెండి, కాసు బంగారం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాము సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాసనమండలి సబార్డినేట్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ తోట



మండపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును శాసన మండలి అనుగత చట్టనిర్మాణ కమిటీ (సబార్డినేట్ లెజిస్లేటివ్ కమిటీ) చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. సబార్డినేట్ కమిటీ ప్రభుత్వ విధానాలు, ప్రణాళికల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తుంది. మండపేటలో ఆదివారం స్థానిక విజయలక్ష్మీనగర్‌లో వున్న వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును వైసీపీ శ్రేణులు, ఆయన అనుచరులు, అభిమానులు కలిసి అభినందనలు తెలిపారు. సబార్డినేట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసు


ట్రావెల్స్ బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న రవాణా శాఖాధికారులు

రావులపాలెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జాతీయ రహదారిపై ఆదివారం జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రవాణా శాఖాధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని 20ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.75వేలు అపరాధా రుసుం విధించారు. ఈతనిఖీల్లో రవాణా శాఖాధికారులు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మీదేవి, షణ్ముఖశ్రీనివాస్, కౌశిక్ పాల్గొన్నారు.

రథం గుడి అభివృద్ధి పనులకు శ్రీకారం


జనార్దనస్వామి ఆలయ రథం షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండపేటలోని రథం గుడి అగస్త్యేశ్వరజనార్దన స్వామి ఆలయంలో రూ.కోటి నిధులతో చేపట్టే రథం షెడ్డుతో పాటు అదనపు భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. తొలుత ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక పెద్దలు, వివిధ పార్టీల నేతలతో కలిసి ఆలయంలో చేపట్టే నిర్మాణాలు గురించి చర్చించారు కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ రాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైసీపీ నేతలు వేగుళ్ల పట్టాభి రామయ్య, వేగుళ్ల నారయ్యబాబు, వార్డుకౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని శ్రీనివాస్, వాదా ప్రసాదరావు, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, పోతంశెట్టి సత్తిబాబు, కోనా సత్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, ఉంగరాల రాంబాబు, కౌన్సిలర్ కాశీన కాశీ, వాకచర్ల గుప్తా, ఆలయ ఈవో కామేశ్వరరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ అసత్య ప్రచారం'


రావులపాలెం సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రావులపాలెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలను చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, కొప్పిశెట్టి ప్రసాద్, ముత్యాల బాబ్జి, యల్లమిల్లి జగన్మోహనరావు, కాసా విజయసాగర్, సాధనాల శ్రీనివాస్, పసుపులేటి రాధాకృష్ణ, బొంతు రాంబాబు, విల్ల రాంబాబు మాట్లాడారు. వైసీపీ నాయకులు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అంటూ ప్రచార సభలు పెట్టి వారి ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే వైసీపీ నేతలు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. కొద్ది రోజుల్లో అమలు చేయబోయే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం తదితర వాటిపై మాట్లాడటం పరిపాటిగా మారిందన్నారు. ఉమ్మడి జిల్లాల్లో ఇసుక, మట్టి, మద్యం దోపిడీలకు పాల్పడ్డ వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి వాటి గురించి పదే పదే మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

నిలకడగా గోదావరి


ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదావరి ప్రవాహం

ఆత్రేయపురం, జూలై 27ఆంధ్రజ్యోతి): ఎగువున కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద ఉధృతంగా ప్రవహించడంతో శనివారం భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతూ వచ్చింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 35అడుగులకు చేరుకుని తగ్గుముఖం పట్టింది. ధవేళశ్వరం బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90అడుగులకు చేరుకుంది. 6,18,044 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. భద్రాచలంలో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ధవేళశ్వరం బ్యారేజీ వద్ద స్వల్పంగా వరద నీరు తగ్గింది. సోమవారం ఉదయానికి మరింత తగ్గుముఖం పడుతుందని హెడ్‌వర్క్స్ అధికారులు తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.6.73 లక్షలు


వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 27ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.6.73లక్షలు లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎంవీ రాఘవ కుటుంబ సభ్యులు వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందచేశారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందచేశారు.

వక్తృత్వ పోటీల్లో 'వీకేవీ' విద్యార్థుల ప్రతిభ


పోటీల విజేతలైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కొత్తపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): యువత - భవిత అనే అంశంపై జిల్లాస్థాయిలో మండపేటలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం మూడో సంవత్సరం చదువు తోన్న విద్యార్థినీలు బేబీ సత్యవాణి, పల్లవి, మీనాక్షిలు తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. 20కళాశాలల విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనగా తమ కళాశాల విద్యార్థినులు తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థినులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.శ్రీనివాసులు, టి.ప్రసన్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేశవరం సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


కేశవరం సహకార సంఘం పాలకవర్గం కొలువుతీరిన దృశ్యం

మండపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): కేశవరం సహకార సంఘ అధ్యక్షుడు ఉండమట్ల రామారావు మృతిచెందడంతో ఆయన తనయుడు శ్రీనివాసరావు అధ్యక్షుడుగా నియమితులయ్యారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు చంద్రమళ్ల ప్రకాశరావు, మేషం సత్య నారాయణలతో ఆదివారం కార్యదర్శి బద్దిరెడ్డి సతీష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి రామారావు ఆశయసాధన మేరకు రైతులకు సంఘం ద్వారా మెరుగైన సేవలు అందిస్తానన్నారు. ఈపదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉండమట్ల రాంబాబు, కర్రి తాతారావు, కంటిపూడి శ్రీను, ఉండమట్ల కొండ్రాజు, కంటిపూడి సురేష్, ఉండమట్ల సురేష్, ఉండమట్ల వీరేంద్ర, సతీష్, గోపిలు పాలకవర్గ సభ్యులను అభినందించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరి అరెస్టు

ఆత్రేయపురం, జూలై 27ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాము హెచ్చరించారు. ఆదివారం ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బర్లంక బ్యారేజీ వద్ద డ్రంకన్ డ్రైవ్‌తో పాటు వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి ఆటో, వాహనం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.